
ప్రభుత్వ స్థలమా.. అది మాదే!



- డీ ఫారం, గెడ్డపోరంబోకు, చెరువుల కబ్జాలో కూటమి నాయకులు
- కబ్జాదారులకు అండగా ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ మాజీ ఎమ్మెల్యే
- అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులపై చిందులు.. బెదిరింపులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ పరిధిలో భూ ఆక్రమణలు పెరిగాయి. ఎక్కడికక్కడ రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకునో, బెదిరించో, భయపెట్టో కబ్జా కాండను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూముల్ని తమ హస్తగతం చేసుకుంటున్నారు. కూటమి నాయకుల కబ్జా కాండను అడ్డుకునే క్రమంలో చర్యలకు సాహసించే రెవెన్యూ అధికారులు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ మాజీ ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగా పూర్తిగా చేతులెత్తేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను తమవంతుగా కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు ఇలా కబ్జాకాండకు అండగా నిలవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

అధికారం అండగా ఉంది. దానికి తోడు పేర్ల వెనుక చిన్నా చితకా పదవు(హోదా)లు తోకల్లా వేలాడుతున్నాయి. అంతగా ముంచుకొస్తే ప్రభుత్వానికి చెందిన ఎమ్మెల్యే/మాజీ ఎమ్మెల్యే.. ఒక్క ఫోన్ కాల్ దూరం. ఇంక అడ్డూఅదుపూ ఏముంది. ప్రభుత్వ స్థలమేదైనా.. అది తమదే అన్నట్లుగా కూటమి నేతలు బరితెగించేస్తున్నారు. పెందుర్తి పరిధిలో గెడ్డపోరంబోకు భూములు, ప్రభుత్వ, డీ ఫారం భూముల్ని ఆక్రమించి, అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఫిర్యాదులున్నా.. విచారణ సున్నా



చినముషిడివాడ సమీపంలోని కార్మికనగర్‌లో చెరువు క్రమేపీ ఆక్రమణలకు గురవుతోంది. స్థానికంగా నివాసం ఉండే ఇద్దరు టీడీపీ నాయకులు ఈ చెరువును చెరబట్టారు. రాత్రికి రాత్రి చెరువు గర్భంలో పాకలు వేసి వచ్చిన కాడికి విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు తరచూ ఫిర్యాదులు వెళుతున్నాయి. స్థానికంగా ఉండే ఓ ఎమ్మెల్యే అనుచరుడు కబ్జాదారులకు అండగా నిలవడంతో అధికారులు కన్నెత్తి చూసేందుక్కూడా సాహసించలేకపోతున్నారు. ఇక్కడి కబ్జా కాండపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లి కనీసం విచారణ ఆదేశించకపోవడం గమనార్హం.

మేం సర్దుకున్నాం.. మీరు సర్దుకుపొండి



పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో నెల రోజుల క్రితం డీ పారం భూమిని ఆక్రమించుకుని స్థానిక ప్రజాప్రతినిధి, మాజీ ప్రజాప్రతినిధి వాణిజ్య సముదాయాల నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు నేపథ్యంలో తొలగించేందుకు రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. కానీ వారిపై సదరు టీడీపీ నాయకులు ఇష్టానుసారం చిందులు తొక్కారు. ఇక్కడి నుంచి వేరే చోటుకు బదిలీ చేయిస్తామంటూ బెదిరించారు. దీనిపై సదరు రెవెన్యూ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే మేం ఆల్రెడీ సర్దుకున్నాం.. మీరూ సర్దుకుపొండి.. అని సెలవీయడంతో ఖంగుతినడం రెవెన్యూ సిబ్బంది వంతయింది.

తొలగిస్తే.. మీ అంతు చూస్తా!



తాజాగా పెందుర్తి రాచ్చెరువు సమీపంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి ఏకంగా వాణిజ్య సముదాయం నిర్మించాడు. గతంలో ఈ కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తి యథేచ్ఛగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. సోమవారం కూడా దాన్ని తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించారు. నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించే సరికి స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధి నేరుగా అక్కడికి చేరుకున్నారు. ఏకంగా పొక్లెయిన్‌కే అడ్డంపడ్డారు. సదరు నిర్మాణాన్ని తొలగిస్తే మీ సంగతి చూస్తానంటూ బెదిరించడంతో, రెవెన్యూ సిబ్బంది సైలెంట్‌గా వెనుదిరిగారు.

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ సీఎం తనను కలిసిన నేతలతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. జమిలి బిల్లు ప్రవేశపెడుతున్న తరుణంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, పెందుర్తి ఇన్‌చార్జి అదీప్‌రాజ్‌లతో సమన్వయం చేసుకుంటూ విజయానికి కృషిచేయాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

24న బ్రాహ్మణ వనసమారాధన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.లక్ష్మీనరసింహం మంగళవారం తెలిపారు. శ్రీకృష్ణాపురంలోని సెంట్రల్ జైల్ సమీపంలో ఉన్న కాశి రాధగారి తోటలో జరిగే కార్యక్రమానికి బ్రాహ్మణులంతా పాల్గొనాల్సిందిగా కోరారు. ఎలాంటి రుసుం లేదన్నారు. వివరాలకు 9603907095, 6309784932 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

విశేషంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం గరుడ సేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందించారు. పూజలో పాల్గొన్న భక్తులు హరినామ స్మరణ చేస్తూ గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



ఆశీర్వచనం స్వీకరిస్తున్న కర్ణాటక అధికారులు వెంకటయ్య, కంబుల్ తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం కర్ణాటక ఐఏఎస్ అధికారులు వెంకయ్య, కంబుల్, ఐపీఎస్ అధికారి కృష్ణమరాజు, ఐఆర్‌ఎస్ అధికారి మహాదేవ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ అందజేశారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు రూ.60,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింహరాజు తెలిపారు. మంగళవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు సెంట్ల ఇంటి స్థలం కోసం ర్యాలీ



దరఖాస్తులు నింపుతున్న మహిళలు

పెందుర్తి: ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో రెండు సెంట్ల ఇంటి స్థలం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో వేపగుంటలో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఇక్కడి ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రజలచే రెండు సెంట్ల ఇంటి స్థలం కోసం దరఖాస్తులు పూర్తి చేయించారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి స్థానిక వార్డు సచివాలయంలో అందించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వుషు జాతీయ పోటీలకు 'సంస్కృతి' విద్యార్థులు



జాతీయ స్థాయి వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గత నెలలో శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వుషు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు రాహుల్ మిస్త్రీ, వి.సంజయ్, సీహెచ్ సహజ్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మంగళవారం తెలిపారు. జాతీయ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 26 వరకు జమ్ములో జరగనున్న జాతీయ స్థాయి వుషు పోటీల్లో తమ విద్యార్థులు ముగ్గురూ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్ రమ్యను పాఠశాల సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

రైతు, కార్మిక సమస్యల పరిష్కారానికి 26న మహాధర్నా



సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: రైతు, కార్మిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతు, కార్మిక సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలకు నిరసనగా ఈ నెల 26న అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని, కార్మికులకు నష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.10 వేలు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజుకు రూ.600 కూలీ చెల్లిస్తూ 200 రోజులు పని దినాలను కల్పించాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రి నాయుడు, దూళి దేముడు, పి.వెంకటరావు, పైల అప్పారావు, ముత్యాలు, వై.అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి'



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

- ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ అవగాహన కార్యక్రమాలు

పెందుర్తి: గ్రామాల్లో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా పినగాడిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆరు బయట మల విసర్జన నాగరికత కాదన్నారు. దాని వలన తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామపెద్దలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: స్వచ్ఛ భారత్ సాకార దిశగా, బహిరంగ మలవిసర్జనకు స్వస్తిపలికి, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, అధికారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ మరుగుదొడ్లు లేని ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 14 మందికి మరుగుదొడ్లు మంజూరు చేశామని, అవసరమైనవారు దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. స్వచ్ఛ గ్రామాల సాకార దిశగా బహిరంగ మలవిసర్జనా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని కోరారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్పలరాజును పరామర్శిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్లనరవకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్పలరాజును పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ మంగళవారం పరామర్శించారు. పినగాడి నుండి సబ్బవరం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా చిన్నయ్యపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో అప్పలరాజు గాయపడ్డారు. చికిత్స అనంతరం, ఇంటికి చేరుకున్న ఆయన్ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని అభిలషించారు. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేటర్ బొప్పా నాగరాజు, పార్టీ నాయకుడు సర్వసిద్ధి బోరయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వార్డ్ మెంబర్లు అప్పికొండ సత్యనారాయణ ఉన్నారు.

మల్లునాయుడుపాలెంలో కార్తీక వనభోజనాలు



వడ్డిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో కొలువైన రావాలమ్మ సన్నిధిలో మంగళవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. గ్రామంలోని కొత్తూరుకు చెందిన గండివారి కుటుంబాలు, రావిపల్లి కుటుంబాల ఆధ్వర్యంలో ఈ వనభోజనాలు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది వచ్చారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, అనంతరం వనభోజనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లునాయుడుపాలెం సర్పంచ్ బోను దేముడమ్మ, గండునాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, గండి త్రినాథరావు, రావిపల్లి అనీష్, గండి సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. భవితకు మార్గనిర్దేశాలు



ఇందిరాగాంధీకి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటునందించిన వారికి సత్కారం



సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న గ్రంథాలయాధికారి

- గ్రంథాలయ వారోత్సవాల్లో ఇందిరాగాంధీకి ఘన నివాళి
- గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడిన వారికి సత్కారం

పెందుర్తి: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఉద్యోగార్థుల భవితకు మార్గనిర్దేశాలన్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పూలమాలవేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిర చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి తోడ్పాటు అందించిన కార్మిక నాయకుడు సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, విద్యావేత్త బి.రాజేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.గంగునాయుడు, పాఠకులు బస్వాన సూర్యమోహన్, వెంకటరావులను దుశ్శాలువాలతో సత్కరించారు. దేవస్థానం విశ్రాంత పర్యవేక్షకుడు వెలమలపల్లి కామేశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, స్థానిక అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, గ్రంథాలయ సేవకులు ఏవీఎస్ భానుమూర్తి, ప్రసాద్, అనురాధ, అజయ్, హరీష్, వర, మహేష్ కిరణ్ కాంత్, రాజేష్, హేమలత, కవిత, మోక్షిత పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయడం ప్రతి ఒక్కరి దినచర్య కావాలన్నారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, వాటిని సద్వినియోగం చేసుకున్నవారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని పేర్కొన్నారు. విద్యార్థులు పత్రికలను చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో పి.ప్రసాద్, జువాలజీ అధ్యాపకులు సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు

పరవాడ: మండలంలోనినాయుడుపాలెం శివారు గంగునాయుడుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురవడంతో కొన్నాళ్లుగా గ్రామ ప్రజలు మంచినీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. సమస్యపై సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య స్పందించారు. బోర్‌వెల్‌కు మంగళవారం మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మరమ్మతు పనుల్ని కూండ్రపు గంగునాయుడు పర్యవేక్షించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి జీవీఎంసీ 96వ వార్డు ప్రశాంతినగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యు లు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. ప్రశాంతినగర్‌లో నివాసం ఉంటున్న మంగళతుట్టి కీర్తన(19) పెందుర్తి ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న ఫోటో ఫ్రేమ్ షాప్‌లో పనిచేస్తోంది. ఈ నెల 13న షాప్‌కు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కీర్తన ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో కీర్తన తల్లి గురమ్మ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఓపీఎస్ సాధన కోసం 'ఛలో విజయవాడ'



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పరవాడ: సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి డిమాండ్ చేశారు. మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 10న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను పరవాడలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎస్వీఆర్ మూర్తి, పరవాడ మండల ప్రధాన కార్యదర్శి అమ్మినాయుడు, యూటీఎఫ్ నాయకులు జాకీర్‌అలీ, డి.శ్రీనివాస్, శివాజీ, భారతి, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయితో ఇద్దరి అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సరిపల్లి చెక్ పోస్టు వద్ద నాలుగు కిలోల లిక్విడ్ గంజాయి(హాస్ ఆయిల్)ను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన కమలు శ్రీగం, ముంచంగిపుట్టుకు చెందిన శోభ రమేష్ కలిసి అరకు నుంచి లిక్విడ్ గంజాయిని స్కూటీపై సోమవారం నగరానికి తీసుకొస్తున్నారు. సరిపల్లి చెక్ పోస్టు వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీసులు స్కూటీని పరిశీలించగా అందులో లిక్విడ్ గంజాయిని గుర్తించారు. వెంటనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు



సిబ్బందికి అవగాహన కలిగిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకంతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని జీవీఎంసీ జోన్-8 కమిషనర్ కె.హైమావతి అన్నారు. వేపగుంటలోని జోన్ కార్యాలయంలో మంగళవారం కార్యాలయ సిబ్బందికి ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ కవర్లను వినియోగించాలన్నారు. ఆయా కవర్లు వేపగుంట కూడలిలోని జీవీఎంసీ పంప్ హౌస్ వద్ద ఉన్న దుకాణంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జోన్ సహాయ వైద్యారోగ్య అధికారి డాక్టర్ బండారు అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ కె.వి.రమణ పాల్గొన్నారు.